సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 19 । మార్చి । 2023



సోమశిలలో 56.280 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 56.280 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 1500 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 530, దక్షిణకాలువకు 300, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,660
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,507
3 శాతం జీఎస్టీతో	రూ.5,672
సవర (8 గ్రా)	రూ.45,376

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /25.0

వాతావరణం

గాలిలో తేమ 93 శాతం ఉంది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం కొన్ని మండలాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షల్లో ఇద్దరు డిబార్



కేఏసీ కళాశాల వద్ద తనిఖీ చేస్తున్న ఆర్ఐఓ

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండగా ఇద్దరు విద్యార్థులను డిబార్ చేశారు. రాష్ట్ర ఇంటర్‌బోర్డు అధికారి శేషుకు మారి స్థానిక ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఎ-సెంటర్‌లో ఒకరిపై, బి-సెంటర్‌లో మరొకరిపై మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేశారు. ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా జనరల్‌కు సంబంధించి మొత్తం 24,169 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 23,641 మంది హాజరయ్యారు. 526 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,652 మంది విద్యార్థులకు గాను 1,555 మంది హాజరయ్యారు. 97 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల కన్వీనర్ వరప్రసాదరావు, జిల్లా అబ్జర్వర్ మధుబాబు, ఫ్లయింగ్, సిటింగ్ స్క్వాడ్ అధికారులు జిల్లాలో 68 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

ఒంగోలు ఇన్‌చార్జి డీటీసీగా చందర్



నెల్లూరు(టౌన్): ప్రకాశం జిల్లా రవాణాశాఖ ఇన్‌చార్జి డీటీసీగా చందర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర రవాణాశాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం ఈయన నెల్లూరు జిల్లా రవాణాశాఖ డీటీసీగా పనిచేస్తున్నారు. ప్రకాశం జిల్లా డీటీసీగా పనిచేస్తున్న కృష్ణవేణికి జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఇన్‌చార్జి డీటీసీగా చందర్ శనివారం ఒంగోలులో బాధ్యతలు స్వీకరించారు.

షెడ్యూల్ కులాల అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు



నెల్లూరు(అర్బన్): సమాజంలో షెడ్యూల్ కులాలు ఆర్థికంగా ఎదిగేందుకు తయారు చేసిన కార్యాచరణ ప్రణాళికను జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తూ వారి అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ చక్రధర్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, ఎల్‌డీఎం శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, డ్వామా పీడీ వెంకట్రావ్, భూగర్భజలవనరులశాఖ, పరిశ్రమలశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల


- 48,582 మందికి రూ.36.53 కోట్లు

నెల్లూరు(వేదాయపాళెం): రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన పథకం నిధులను ఆదివారం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత ఇన్‌చార్జి అధికారి వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలోని తిరువూరు నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తారని తెలిపారు. అనంతరం సీఎం అక్కడి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరు కలెక్టరేట్‌లో ఆదివారం కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులు హాజరుకానున్నారు. జిల్లాకు సంబంధించి 48,582 మంది విద్యార్థులకు రూ.36.53 కోట్లు వారి తల్లుల ఖాతాల్లో జమ కానున్నాయి.

అది పవిత్ర పినాకినీ తీరంలో శతాబ్దాల క్రితం నిర్మించిన నాగేశ్వరాలయం. కొన్ని దశాబ్దాల క్రితమే పెన్నానదిలో ఇసుకలో పూడిపోయింది. రూ.కోట్ల విలువైన మాన్యం భూములు ఉన్న ఆలయం భౌతికంగా కనుమరుగైనా దేవదాయశాఖ అధికారులు ఆలయ ఆస్తులపై వచ్చే రాబడిని వివిధ కార్యక్రమాల పేరిట కైంకర్యం చేస్తూనే ఉన్నారు. ఏళ్లతరబడి భూములను నామమాత్రపు కౌలుకు ఇచ్చి కొందరి గుత్తాధిపత్యంలోనే ఉంచి స్వామి సొమ్ము దిగమింగుతున్నారు. రెండేళ్ల క్రితం ఇసుక తవ్వకాల్లో శిథిల ఆలయం బయల్పడినా.. నూతన ఆలయ నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోగా.. లేని ఆలయానికి పూజారి, ఆయనకు జీతం కట్టబెడుతున్నారు.

స్వామీ.. మర్మం కనవేమి!

పెన్నానది ఇసుకలో పూడిపోయిన నాగేశ్వరాలయం



భూ కామందులతో దేవదాయశాఖ కుమ్మక్కు

- 80 ఎకరాల మాన్యం భూములున్నా రూ.80 వేలు కూడా కౌలు లేదాయె!
- ఆలయం కనుమరుగైనా పూజారికి మాత్రం జీతం చెల్లింపు
- ఇదీ పెరుమాళ్లపాడు నాగేశ్వరాలయం కథ

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్ల మండలం పెరుమాళ్లపాడు పెన్నానది తీర గ్రామం. ఈ ఒడ్డునే కొన్ని శతాబ్దాల క్రితం పరశురాముడు కర్మ విమోచనార్థం కామాక్షి సమేత నాగేశ్వరస్వామి ఆలయం(శివాలయం) నిర్మించినట్లు తెలుస్తోంది. ఈ ఆలయానికి పెరుమాళ్లపాడు, గొల్లపల్లి, పాడేరు, ఊళ్లపల్లి, చేజర్ల, ఓబులాయపల్లి తదితర గ్రామాల్లో సర్వే నంబర్లు 19, 20, 21, 90, 102, 138ఎ, 160, 656లో 80.50 ఎకరాల మెట్ట, మాగాణి భూములు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఆలయానికి ఇన్ని భూములు ఉన్నాయంటే.. అప్పట్లో ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచిందిగా చెప్పుకోవచ్చు. అనంతర కాలంలో పెన్నానదిలో వరదలకు ఆలయం ఇసుక గర్భంలో కూరుకుపోయింది.

రెండేళ్ల క్రితం వెలుగులోకి..


సుమారు 70 ఏళ్ల క్రితమే ఈ ఆలయం ఇసుకలో పూడిపోయింది. గ్రామానికి చెందిన కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతోపాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా రెండేళ్ల క్రితం కరోనా సమయంలో సొంతూరుకు చేరుకున్నారు. ఆ సమయంలో కొందరు పెద్దల ద్వారా ఇసుక కింద ఆలయం ఒకటి ఉందని తెలియడంతో అందరూ కలిసి జేసీబీలతో తవ్వకాలు చేపట్టడంతో శిథిలావస్థలో ఉన్న ఆలయం బయటపడింది.

పక్కదారి పట్టిస్తున్న కౌలు సొమ్ము

ఈ ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల్లో 80.50 ఎకరాల మెట్ట, మాగాణి భూములు ఉన్నాయి. ఎకరాకు తక్కువలో తక్కువగా లెక్కించినా.. ప్రస్తుత ధరల మేరకు ఏటా రూ.15 వేలకు పైగా వస్తుంది. ఈ లెక్కన ఏటా రూ.లక్షల్లో కౌలు రాబడి రావాల్సి ఉన్నా.. దేవదాయశాఖ అధికారులు కొందరి చేతుల్లో దశాబ్దాలుగా ఆలయ భూములు ఉంచి అధికారికంగా నామమాత్రపు కౌలు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం 80.50 ఎకరాలకు ఏటా కౌలుగా రూ.78,200 మాత్రమే వస్తోంది. ప్రతి మూడేళ్లకోసారి భూముల వేలం నిర్వహించాల్సి ఉంది. అయితే ఇప్పటికి ఐదేళ్లు అయినా వేలం నిర్వహించలేదు. 1989 నుంచి వసూలు చేస్తున్న భూమి కౌలుపై లెక్కలు కూడా లేవంటే ఆ శాఖ అధికారుల తీరు ఎంతమాత్రమో తెలుస్తోంది.

కానీ ఖర్చు లేకపోయినా..రూ.లక్షల్లో వ్యయం

ఇసుకలో కూరుకుపోయిన నాగేశ్వరాలయం నిర్వహణకు ఒక్కపైసా ఖర్చు లేదు. అయితే ఏటా ఆలయానికి వచ్చే కౌలు ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో బ్యాంక్‌లో జమ చేయాల్సి ఉండగా దేవదాయ శాఖాధికారులు జిల్లాలోని ఇతర దేవాలయాలు, సత్రాల కోర్టు వ్యాజ్యాలకు, నిర్వహణకు ఖర్చు చేసినట్లు చెప్పడం విశేషం. పదేళ్ల కాలంలో రూ.4.5 లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపుతున్నారు. ఆత్మకూరులోని కొలగాని రామయ్య సత్రానికి రూ.1.50 లక్షలు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. అయితే అసలు భౌతికంగా లేని సత్రానికి నిర్వహణ ఏమిటని అడిగితే సత్రం స్థలంపై కేసులు ఉండడంతో కోర్టు ఖర్చుల కోసం వాడినట్లు చెప్పడం గమనార్హం.



రెండేళ్ల క్రితం గ్రామంలోని యువకులు పూడిక నుంచి వెలికి తీసిన నాగేశ్వరాలయం(ఫైల్)

విరాళాలు సిద్ధంగా ఉన్నా.. పునరుద్ధరణ ఏదీ?

ఏటా ఆలయ భూములపై వచ్చే కౌలు వసూలు చేసే దేవదాయశాఖ అధికారులు గతంలో ఆలయం ఉన్న చోట కానీ, గ్రామంలో మరోచోట కానీ నూతన ఆలయ నిర్మాణానికి ఆలోచన చేయకపోవడం, ప్రణాళికలు రూపొందించకపోవడం దారుణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని పలువురు రైతులు, యువకులు ముందుకు వచ్చి రూ.9 లక్షలు పోగు చేసి నూతన ఆలయ నిర్మాణానికి తమవంతు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నా.. ఆ శాఖ అధికారులు స్పందించకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది.

ఉత్సవ విగ్రహాలు సంగంలో..

కామాక్షి సమేత నాగేశ్వరస్వామి ఆలయానికి అప్పట్లో దాతల సహకారంతో మూడు పంచలోహ విగ్రహాలు తయారు చేయించారు. ఆలయం ఇసుకలో పూడిపోవడంతో కొంతకాలం గ్రామంలోని ఓ ఇంట్లో భద్రపరిచినా, అనంతరం సంగంలోని శివాలయంలో దేవదాయశాఖ అధికారుల సహకారంతో భద్రపరిచారు. ఇప్పటికీ ఆ పంచలోహ విగ్రహాలు అక్కడే ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

లేని ఆలయానికి పూజారి, జీతం

వినేందుకు వింతగా ఉన్నా ఇది నిజం. 70 ఏళ్ల క్రితం ఇసుకలో పూడిపోయిన ఈ నాగేశ్వరాలయానికి గతంలో గుమాస్తాగా పనిచేస్తున్న మల్లికార్జున నిర్వాకంతో ఈ ఆలయానికి పూజారి ఉన్నట్లు, అతనికి ప్రతి నెలా జీతం చెల్లిస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేశారు. గతేడాది అనారోగ్యంతో మృతిచెందిన మల్లికార్జునపై గ్రామస్తులు కలెక్టర్‌కు, దేవదాయశాఖ ఉన్నతాధికారులకు అనేక ఫిర్యాదులు ఇచ్చినా చర్యలు తీసుకోకపోగా, విచారణ కూడా చేయలేదని, ఇప్పుడు అతని కుటుంబంలో వారికి ఉద్యోగం ఇచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మేము సహకరిస్తాం



అనాదిగా ఉన్న నాగేశ్వరాలయం పునర్నిర్మించడమో, గ్రామంలో నూతన ఆలయం కట్టడమో చేస్తే గ్రామస్తులందరం సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందుకు రూ.9 లక్షల నిధులు మా వద్ద ఉన్నాయి. పలుమార్లు ఈ విషయమై కలెక్టర్, దేవదాయశాఖ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. వసూలు చేసిన పొలాల కౌలు నిధులు లెక్కలు చెప్పాలని అధికారులను కోరాను. ఇతర ఆలయాలకు ఖర్చు చేసిన నిధులు తిరిగి ఆ ఊరి ఆలయ అకౌంట్‌లో జమ చేయాలని అధికారులను కోరుతున్నాను.

– పోతుగుంట వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ చైర్మన్, పెరుమాళ్లపాడు

ఆలయాల అధికారులకు నోటీసులు ఇచ్చాం



నాగేశ్వరాలయానికి చెందిన పొలాల కౌలు నిధుల నుంచి కొన్ని ఇతర దేవాలయాలకు, సత్రాలకు ఖర్చు చేసింది వాస్తవమే. ఇది నేను ఈ ప్రాంతానికి రాక ముందు జరిగింది. ఖర్చు చేసిన ఆ ఆలయాల నిర్వాహకులకు తిరిగి ఇవ్వాలని లేఖలు రాయడంతోపాటు నోటీసులు ఇచ్చాం. త్వరలో జమయ్యేలా ప్రయత్నం చేస్తున్నాను. గతంలో కొంత నగదు దుర్వినియోగం అయినట్లు తెలుస్తోంది.

– దాసరి ప్రసాద్, గ్రూప్ దేవాలయాల ఈఓ, చేజర్ల

భూముల కౌలు వేలంపై త్వరలో నిర్ణయం



పెరుమాళ్లపాడు నాగేశ్వరాలయం భూముల కౌలు వేలం త్వరలో నిర్వహించాల్సి ఉంది. నూతన ఆలయ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు గ్రామంలో స్థలం చూపితే పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపి నిర్మాణానికి మావంతు సహకారం అందిస్తాం. గతంలో గుమాస్తా నిధులు దుర్వినియోగం చేసిన విషయం ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. పరిశీలిస్తాం. వారి కుటుంబంలో ఎవరికీ ఇంకా ఉద్యోగం ఇవ్వలేదు.

– పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏసీ, దేవదాయశాఖ, నెల్లూరు

నలుగురు వీఏఏలపై వేటు

రైతులకు సహకారం అందించాల్సిన గ్రామ వ్యవసాయ సహాయకులు అడ్డదారులు తొక్కారు. దళారులు ఇచ్చే పైకానికి కక్కుర్తి పడి ఈ-క్రాప్‌లో తప్పుడు సమాచారం నమోదు చేశారు. రైతులు పంటలు సాగు చేయని భూముల్లో సైతం పంటలు వేసినట్లుగా దళారుల పేరుతో వివరాలు నమోదు చేశారు. వీఏఏలు క్షేత్రస్థాయిలో చేసిన ఈ-క్రాప్ బుకింగ్‌పై వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు చేపట్టగా వారు చేసిన అక్రమాలు వెలుగుచూశాయి. దీంతో సస్పెన్షన్‌కు గురయ్యారు.

- లేని పంటలకు ఉన్నట్లుగా ఈ-క్రాప్ నమోదు
- దళారులు ధాన్యం సేకరించేందుకు సహకరించిన వైనం
- దగదర్తి, అల్లూరు పరిధిలో అక్రమాలు
- వ్యవసాయశాఖ దర్యాప్తులో వెల్లడి
- వెంకటాచలంలో ఎరువుల నగదు వీఏఏ స్వాహా

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ) దళారులు ఇచ్చే డబ్బులకు ఆశపడి అక్రమాలకు పాల్పడుతూ వారికి సహకారం అందించారు. ఈ-క్రాప్ బుకింగ్‌లో తప్పులు నమోదు చేశారు. పంటల సాగుకు పనికిరాని భూముల్లో సైతం పంటలు వేస్తున్నట్లు ఈ-క్రాప్‌లో నమోదు చేసి దళారులకు సహకరించారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసే దళారులు, అదే ధాన్యాన్ని సర్కారు ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వానికే విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా అల్లూరు, దగదర్తి మండలాల్లో ముగ్గురు వీఏఏలు ఈ-క్రాప్ నమోదులో చేసిన తప్పిదాలను అధికారులు గుర్తించి వారిని సస్పెండ్ చేశారు. అలాగే వెంకటాచలం మండలంలో ఎరువులను విక్రయించగా వచ్చిన నగదును మార్క్‌ఫెడ్ అధికారులకు చెల్లించకుండా వీఏఏ తన సొంతానికి ఉపయోగించుకోవడంతో అతనిని కూడా సస్పెండ్ చేశారు. గతేడాది కూడా ఇదే తరహాలో తప్పిదాలు చేసిన 17 మందిపై వేటు వేసిన విషయం తెలిసిందే. అందులోని వారే తిరిగి అదే తప్పును చేసి దొరికిపోవడం గమనార్హం.

దళారులను రైతులుగా చూపి..

అల్లూరు మండలంలోని ఇస్కపల్లి, గ్రద్దగుంట, దగదర్తి మండలంలోని తడకలూరు రైతుభరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న ముగ్గురు వీఏఏలు చేతివాటం ప్రదర్శించారు. వాస్తవంగా వరి పంట సాగు చేసిన దానికన్నా అధికంగా ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. దాదాపు 257 ఎకరాల విస్తీర్ణంలో పంటలు వేయకున్నా ఆ సర్వేనంబర్లు వేసి దళారుల పేరిట ఈ-క్రాప్ నమోదు చేశారు. ఆ దళారులను రైతులుగా చూపి ధాన్యం కొనుగోలు పర్మిట్లు దక్కించుకునేలా చేశారు. పంటలు వేయని భూముల సర్వేనంబర్లలో పంట వేసిన ఫొటో అటాచ్ చేసి లేనిది ఉన్నట్లుగా ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. ఈ అక్రమాలను గుర్తించిన వ్యవసాయశాఖ అధికారులు నివేదికను కలెక్టర్‌కు పంపడంతో వారిని సస్పెండ్ చేశారు. ఇందులో విశేషమేమిటంటే గతేడాది కూడా ఈ ముగ్గురూ ఇదే తరహాలో అక్రమాలకు పాల్పడి సస్పెన్షన్‌కు గురయ్యారు.

కాకుటూరు వీఏఏ సస్పెన్షన్

వెంకటాచలం మండలం కాకుటూరు వీఏఏ సురేష్‌ను కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు సస్పెండ్ చేశారు. ఈ ఏడాది ప్రభుత్వం కాకుటూరు రైతుభరోసా కేంద్రం ద్వారా రైతులకు ఎరువులను సరఫరా చేసింది. యూరియా, డీఏపీ తదితర రకాల ఎరువులను రైతులు ఆర్బీకే ద్వారా తీసుకుని వీఏఏ సురేష్‌కు నగదు చెల్లించారు. అయితే రైతులు చెల్లించిన నగదును వీఏఏ సురేష్ మార్క్‌ఫెడ్ అధికారులకు చెల్లించకుండా తన సొంత అవసరాలకు వినియోగించుకున్నాడు. చెల్లించాల్సిన నగదు గురించి పలుమార్లు అధికారులు ప్రశ్నించగా రైతులు ఇంకా చెల్లించలేదని నమ్మిస్తూ వచ్చాడు. ఇటీవల కొందరు అధికారులు కాకుటూరు గ్రామానికి వచ్చి ఎరువులు కొనుగోలు చేసిన రైతులు ఎవరైనా బకాయిలు ఉన్నారా అని ఆరా తీయగా, గ్రామంలో బకాయిలు చెల్లించాల్సిన రైతులు ఎవరూ లేరని తేలింది. ఈ విషయాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కలెక్టర్‌కు నివేదిక పంపడంతో ఈ నెల 14న వీఏఏ సురేష్‌ను సస్పెండ్ చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

నలుగురిని సస్పెండ్ చేశాం

జిల్లాలో అక్రమాలకు పాల్పడిన నలుగురు వీఏఏలను సస్పెండ్ చేశాం. వెంకటాచలం మండలం కాకుటూరు వీఏఏతోపాటు దగదర్తి, అల్లూరు ప్రాంతాల్లో మరో ముగ్గురిని సస్పెండ్ చేశాం. గతేడాది కూడా ఈ-క్రాప్ నమోదులో అక్రమాలు జరిగినట్లు గుర్తించి చర్యలు చేపట్టాం. తప్పు చేసిన వారిపై చర్యలు కఠినంగా ఉంటాయి.

– సుధాకర్‌రాజు, జేడీ, వ్యవసాయశాఖ



కలిగిరిలో నేల వాలిన వరిపైరు

అకాల వర్షంతో పంటలకు నష్టం

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని పలు మండలాల్లో శనివారం అకాల వర్షం కురిసింది. జిల్లాలో సరాసరి వర్షం 17.7 మిల్లీమీటర్లు కురిసిందని అధికారులు తెలిపారు. అయితే కొన్ని మండలాల్లో 3 సెంటీమీటర్ల వరకు వర్షం కురిసిందని రైతులు పేర్కొన్నారు. పలు గ్రామాల్లో భారీ వర్షంతోపాటు బలమైన గాలులు వీయడంతో పైర్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం పలు గ్రామాల్లో నీట మునిగింది. జిల్లాలోని జలదంకి, బోగోలు, దగదర్తి, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరు, రాపూరు, కలిగిరి, కొండాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో కురిసిన వర్షం రైతులను నిలువునా ముంచేసింది. కలిగిరి, కోవూరు, నెల్లూరురూరల్, కోవూరు తదితర ప్రాంతాల్లో కోతదశలో ఉన్న వరి పంట గాలుల తీవ్రతకు నేలవాలింది. చేతికందాల్సిన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షం, గాలుల ధాటికి..

శనివారం సాయంత్రం వరకు అక్కడక్కడా పెద్ద వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల తర్వాత బోగోలు, జలదంకి తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. జలదంకి మండలం అన్నవరంలోని రామాలయంలో ధ్వజస్తంభం కూలిపోయింది. అదే మండలంలోని గట్టుపల్లి శివాలయం సమీపంలో పిడుగులు పడినట్లు సమాచారం. కేశవరం, రామవరప్పాడు తదితర ప్రాంతాల్లో వరి పొలాలు నీటమునిగాయి. వరి, పత్తి, వేరుశనగ, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల చెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. గట్టుపల్లిలో చెట్లు ఇళ్లపై కూలిపోయాయి. వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం వివరాలు సేకరిస్తున్నారు. వర్షాలు ఆగిపోతే పూర్తిస్థాయి నష్టం అంచనా వేయగలమని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటించారు. నెల్లూరులో వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. గాంధీబొమ్మ తదితర చోట్ల డ్రైనేజీ నీరు వర్షపునీటితో కలిసి ప్రవహించింది. దీంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

26న రెడ్‌క్రాస్ ఎన్నికలకు నామినేషన్లు

- ఏప్రిల్ 2న ఎన్నికలు

నెల్లూరు (అర్బన్) : ప్రతిష్టాత్మక ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ ఎన్నికల నిర్వహణకు ఆశాఖ ప్రెసిడెంట్, కలెక్టర్ చక్రధర్‌బాబు తమకు ఆదేశాలు జారీ చేశారని జిల్లా సహకార శాఖ అధికారి, ఎన్నికల నిర్వహణాధికారి తిరుపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న కస్తూర్బా కళాక్షేత్రంలో సమావేశం నిర్వహించి రెడ్‌క్రాస్ కమిటీకి 15 మంది సభ్యులను ఎన్నుకునేందుకు నామినేషన్లను స్వీకరిస్తారన్నారు. అదేరోజు మధ్యాహ్నం నామినేషన్ల ప్రక్రియ ఉంటుందని, ఇందుకు ఫీజు రూ.1000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి నామినేషన్లను స్క్రూటినీ చేసి వివరాలను ప్రకటిస్తారన్నారు. నామినేషన్‌ల ఉప సంహరణకు అదే రోజు సాయంత్రం 5 వరకు గడువు ఉంటుందని తెలియజేశారు.

4న చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక

ఒక వేళ పోటీ ఉంటే ఏప్రిల్ 2న ఎన్నికలు నిర్వహిస్తామని డీసీఓ తిరుపాల్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు, చేజర్ల, కలువాయి, కొడవలూరు, మర్రిపాడు, ఉదయగిరి, విడవలూరు, నెల్లూరు బ్రాంచ్‌లకు నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఎన్నిక నిర్వహిస్తామన్నారు. కావలి, బోగోలు, దుత్తలూరు, కలిగిరి, కందుకూరు, కొండాపురం, వింజమూరు బ్రాంచ్‌లకు కావలి రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు 3న జరుగుతుందని తెలిపారు. గెలుపొందిన వారిని ప్రకటిస్తామన్నారు. ఎన్నికైన సభ్యులు 4న రెడ్‌క్రాస్ సంస్థకు చైర్మన్, వైస్ చైర్మన్, ట్రెజరర్‌లను ఎన్నుకుంటారని తెలిపారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.75
సన్నవి	రూ.60
పండ్లు	రూ.35

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్: లైవ్	రూ.109
లేయర్ లైవ్	రూ.75
బ్రాయిలర్ చికెన్	రూ.194
స్కిన్‌లెస్ చికెన్	రూ.216
లేయర్ చికెన్	రూ.128

కేవైసీ అప్‌డేట్ పేరిట మెసేజ్

- రూ.1.49 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

నెల్లూరు(క్రైమ్) : కేవైసీ అప్‌డేట్ పేరిట ఫోన్‌కు మెసేజ్ పంపారు. లింక్ ఓపెన్ చేయగానే బ్యాంక్ ఖాతాలోని నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారు. వివరాల్లోకి వెళ్లితే.. వనంతోపులోని ఓ అపార్ట్‌మెంట్‌లో విశ్రాంత ఏఈ వెంకురెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయనకు ఎస్‌బీఐ నెల్లూరు టౌన్ బ్రాంచ్‌లో అకౌంట్ ఉంది. ఈనెల 17న ఆయన ఫోన్‌కు కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని, లేనిపక్షంలో అకౌంట్ బ్లాక్ అవుతుందని మెసేజ్ వచ్చింది. అది నిజమేనని భావించిన ఆయన మెసేజ్‌లోని లింక్‌ను తెరవగానే అకౌంట్‌లోని రూ.1.49 లక్షలు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు బ్యాంక్ అధికారులను సంప్రదించగా గుర్తుతెలియని వ్యక్తులు నగదును డ్రా చేసినట్లు వెల్లడించి అకౌంట్‌ను బ్లాక్ చేశారు. దీనిపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని బాధితుడు శనివారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



శివబ్రహ్మచారి మృతదేహం

కావలి రూరల్ : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఇంటో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం కావలిలో చోటుచేసుకుంది. కావలి రూరల్ ఎస్సై ఎం.వెంకటరావు తెలిపిన సమాచారం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన వల్లభోజల శివ బ్రహ్మచారి(31) కొన్ని సంవత్సరాల క్రితం కావలి వచ్చి కొయ్యపని, కూలి పనులు చేసుకుంటూ భార్య సాయి పుణ్యవతితో కలిసి జీవనం సాగిస్తుండేవాడు. వీరికి ఇద్దరు కుమారులు జన్మించగా ఒక బాబు అనారోగ్యంతో మరణించాడు. మద్యానికి బానిసైన అతను ప్రతినిత్యం భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్తపై అల్లుడి దాడి

సీతారామపురం : మండలంలోని బసినేనిపల్లికి చెందిన ఇర్ల రంగమ్మపై అల్లుడు వెంగయ్య కత్తిపీటతో దాడి చేసిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పామూరు మండలం, కట్టకిందపల్లికి చెందిన వెంగయ్య శుక్రవారం బసినేనిపల్లిలోని అత్తారింటికి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో అత్త రంగమ్మ అడ్డురావడంతో కత్తిపీటతో దాడి చేశాడు. దీంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో సీతారామపురం పీహెచ్‌సీకి తరలించి మెరుగైన వైద్యం కోసం ఉదయగిరి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.